మొక్కలు నాటిన విద్యార్థులు



మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులు ప్రిన్సిపాల్‌, అధ్యాపకులతో కలిసి సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ సీవీ నరసింహులు మాట్లాడుతూ... విద్యార్థులకు పర్యావరణం, పచ్చదనం ప్రాధాన్యతలపై అవగాహన కల్పించటంలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. నేడు నాటే మొక్క రాబోయే తరాల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుందన్నారు. సమాజ హితం కోసం సీబీఐటీ నిరంతరం కట్టుబడి ఉంటుందన్నారు.

వృద్ధుడి అదృశ్యం



బాలయ్య

శంషాబాద్‌: పసరు కట్టు కట్టించుకోడానికి శంషాబాద్‌ వచ్చిన ఓ వృద్ధుడు బస్టాండ్‌లో అదృశ్యమైన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... గచ్చిబౌలిలో రాజీవ్‌నగర్‌ వడ్డెరబస్తీకి చెందిన ముందగుల బాలయ్య(70) చేతికి పసరు కట్టు కట్టించుకోడానికి తన భార్యతో కలిసి ఈ నెల 22 ఉదయం శంషాబాద్‌ పాత పోలీస్‌స్టేషన్‌ బస్తీకి వచ్చాడు. వైద్యుడు లేకపోవడంతో తిరిగి వెళ్లేందుకు ఇద్దరు బస్టాండ్‌కు చేరుకున్నారు. భార్యను బస్టాండ్‌లో కూర్చోబెట్టి మూత్రశాలకు వెళ్లి వస్తానని తిరిగి రాలేదు. దీంతో పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోడంతో కుటుంబ సభ్యులు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమాజసేవలో యువత ముందుండాలి

'నిథమ్‌' డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ వి వెంకటరమణ

రాయదుర్గం: సమాజసేవలో విద్యార్థులు, యువత ముందుండాలని నిథమ్‌ డైరెక్టర్‌ ప్రొ. వెంకటరమణ సూచించారు. గచ్చిబౌలిలోని 'నిథమ్‌' క్యాంపస్‌లోని హాస్పిటాలిటీ బ్లాక్‌లో సోమవారం నిజాం ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ మెడికల్‌ సైన్సెస్‌, బ్రహ్మకుమారీస్‌ సంస్థ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతులు తరచూ రక్తదానం చేయాలని, ప్రాణదానం చేసినట్లు అవుతుందన్నారు. బ్రహ్మకుమారీస్‌ సంస్థ ప్రతినిధి బి.కె.సాక్షి మాట్లాడుతూ మానవతాదృక్పథంతో సేవా కార్యక్రమాలను చేసేందుకు స్వచ్ఛందంగా అందరూ ముందుకు రావాలన్నారు. నిథమ్‌ విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు. రక్తదాన శిబిరం కోఆర్డినేటర్‌ డాక్టర్‌ ఎస్‌ యాదగిరి, నిమ్స్‌ డాక్టర్‌ రఫత్‌, నిథమ్‌ ఫ్యాకల్టీ, అధికారులు, విద్యార్థులు, బ్రహ్మకుమారీస్‌ సంస్థ ప్రతినిధులు, నిమ్స్‌ వైద్య బృందం పాల్గొన్నారు.

విద్యార్థులు గ్రామాలకు వెళ్లాలి

ప్రొఫెసర్‌ కంచ ఐలయ్య

రాయదుర్గం: విద్యార్థులు గ్రామాలకు వెళ్ళి జ్ఞానం పంచాలని ప్రొ.కంచ ఐలయ్య సూచించారు. సోమవారం రాత్రి గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లోని డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ ఆడిటోరియంలో ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బీపీ మండల్‌ జయంతి వేడుకలు, శూద్ర రెబెలియన్‌ గ్రంథంపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇంగ్లిష్‌లో మాట్లాడడం, రాయడం అకడమిక్‌గా రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రొ.బంగ్యభూక్యా, వసుమతి యాదవ్‌, ఏఐఓబీసీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు జి కిరణ్‌కుమార్‌ ప్రసంగించారు.

యజమానులపై హాస్టల్‌ నిర్వాహకుల దాడి

గచ్చిబౌలి పీఎస్‌లో కేసు నమోదు

గచ్చిబౌలి: కోర్టు ఆదేశాలతో హాఖాళీ చేయాలని వచ్చిన భవనం యజమానులపై హాస్టల్‌ నిర్వాహకులు దాడికి తెగబడ్డారు. బాధితుల ఫిర్యాదుతో గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితులు తెలిపిన ప్రకారం.. గచ్చిబౌలి ఇందిరానగర్‌లో కోడూరు మాన్షన్‌లో 2016లో 20 ఫ్లాట్లను నెక్సజెన్‌ హాస్టల్‌కు అద్దెకు ఇచ్చారు. 2020లో అగ్రిమెంట్‌ గడువు ముగిసినా ఖాళీ చేయలేదు. దీంతో ఫ్లాట్ల యజమానులు కోర్టును ఆశ్రయించారు. కొద్ది నెలల క్రితం కోర్టు ఆదేశాలతో 9 ఫ్లాట్లను ఖాళీ చేయించారు. మిగతా ఆరు ఫ్లాట్లను ఖాళీ చేయాలని కూకట్‌పల్లి కోర్టు ఆదేశించడంతో సోమవారం ఫ్లాట్ల యజమానులు భవనం వద్దకు వెళ్లారు. కోర్టు సిబ్బంది, లాయర్‌తో కలిసి హాస్టల్‌ ఖాళీ చే యాలని చెప్పారు. సాయంత్రం 4 గంటల సమయంలో అమర్‌నాథ్‌ రెడ్డి అనే వ్యక్తి అనుచరులతో వచ్చి కర్రలు, రాడ్లతో దాడికి దిగారు. పిచ్చేశ్వర్‌రావు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సునేష్‌, శ్రీకాంత్‌, రజినికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్‌ హబీబుల్లాఖాన్‌ తెలిపారు.

మండపాలకు గణనాథులు

- గణనాథుడి పూజలకు ఘనంగా ఏర్పాట్లు
- కాలనీలు, అపార్ట్‌మెంట్‌లలో సందడి
- ప్రమాదాల నివారణకు విద్యుత్‌ సిబ్బంది ఎస్కార్ట్‌



వినాయకుడికి స్వాగతం తెలుపుతున్న అలకాపూర్‌ టౌన్‌షిప్‌ ప్రజలు




విద్యుత్‌ ప్రమాదాలు జరగకుండా విగ్రహాలకు ఎస్కార్ట్‌గా ఉన్న సిబ్బంది



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న రాజేంద్రనగర్‌ జెడ్‌సీ సురేందర్‌రెడ్డి

మణికొండ/రాజేంద్రనగర్‌: ఆదిదేవుడైన వినాయకుడి పూజలకు ఏర్పాట్లను ఘనంగా చేస్తున్నారు. బుధవారం వినాయక చవితి పండగ ఉండటంతో అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లను చకచకా పూర్తి చేస్తున్నారు. రాజేంద్రనగర్‌ నియోజకవర్గం పరిధిలోని శంషాబాద్‌, మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలలతో పాటు బండ్లగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌, జీహెచ్‌ఎంసీ సర్కిల్‌లోని ఐదు డివిజన్‌లు, శంషాబాద్‌ మండల పరిధిలోని గ్రామాలలో ఇప్పటికే వినాయక మండపాలను ఏర్పాటు చేశారు. ప్రధాన వినాయకులను నెలకొల్పే మండపాలకు ఇప్పటికే వినాయక ప్రతిమలను తీసుకుని వచ్చారు. మిగిలి ఉన్న మండప పనులతో పాటు అలంకరణలను శరవేగంగా పూర్తి చేస్తున్నారు. ఇతర మండపాల కంటే తమ మండపం, వినాయకుడు, ఉత్సవాలు ఘనంగా ఉండాలనే తలంపుతో ఏర్పాట్లు పోటాపోటీగా చేస్తున్నారు. ఇటీవల రామంతాపూర్‌లో విద్యుత్‌ వైర్లు తగిలి ఆరుగురు మృతి చెందిన నేపథ్యంలో మణికొండ మున్సిపాలిటీ పరిధిలో అలాంటి పరిస్థితి రాకుండా విద్యుత్‌ అధికారులు, సిబ్బంది మండపాలను వస్తున్న విగ్రహాలకు ఎస్కార్ట్‌గా ఉండి ప్రమాదాలను నివారించే పనులను చేపట్టారు.



పెద్దషాపూర్‌లో ఏర్పాటు చేస్తున్న మట్టి వినాయకుడు

మట్టి వినాయకులే ప్రాధాన్యం..

రాజేంద్రనగర్‌ నియోజకవర్గ వ్యాప్తంగా కాలనీలు, అపార్ట్‌మెంట్‌లు, గృహాలలో మట్టి వినాయకులనే నెలకొల్పి పూజలను ఘనంగా చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, పలు సంస్థలు అక్కడక్కడ మట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ప్రధాన కాలనీలు, బస్తీలలో మాత్రం రంగు, రంగుల భారీ వినాయకులను ఏర్పాటు చేసి అదే స్థాయిలో అలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మండపాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బారికేడ్లు, క్యూలైన్లు భద్రత ఏర్పాటు చేస్తున్నారు. ఆయా కాలనీలు, గ్రామాలు, బస్తీలలో ఏర్పాటు చేసే వినాయకుల వివరాలను తీసుకున్న పోలీసు అధికారులు వాటి వద్ద చేపట్టాల్సిన చర్యలను నిర్వాహకులకు వివరిస్తున్నారు. రాత్రి సమయాల్లో మండపాలలో తప్పనిసరి నిర్వాహకులు ఉండాలని, డీజే చప్పుల్లు వద్దని, పెట్రోలింగ్‌ పెంచుతామని సూచిస్తున్నారు.



ఎర్రకుంటతండాకు తీసుకొచ్చిన గణనాథుడి విగ్రహం



మణికొండ అలకాపూర్‌ టౌన్‌షిప్‌లో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న వాసవి వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు

గ్రామాలకు తరలివస్తున్న వినాయకులు..

శంషాబాద్‌ రూరల్‌: వినాయక చవితిని పురస్కరించుకొని గణనాథుల విగ్రహాలను గ్రామాలకు తరలివస్తున్నారు. నిర్వాహకులు ఆయా గ్రామాల్లో గణేష్‌ మండపాలను అందంగా అలంకరిస్తున్నారు. పెద్దషాపూర్‌లో శ్రీ హనుమాన్‌ యూత్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఐదు అడుగుల మట్టి వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

అత్తాపూర్‌: గుంతలమయంగా మారిన రోడ్డు కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ నెల 17వ తేదీన 'అత్తాపూర్‌ రోడ్లపై నడ్డివిరిచే గుంతలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ దారి గూండా ప్రయాణించాలంటే పాదచారులు, వాహనాదారులు తీవ్ర ఇబ్బందులకు గురై ప్రమాదాలకు సైతం పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. రోజురోజుకూ సమస్య తీవ్రం అవుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిలో 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో అధికారులు రోడ్డు పనులను ప్రారంభించడంతో ప్రజలు 'సాక్షి'కి ధన్యవాదాలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్‌..



అత్తాపూర్‌ రోడ్డుపై పనులు చేపట్టిన దృశ్యం

గణేశ్‌ నవరాత్రులను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



వినాయక ఉత్సవాలపై సమావేశమైన అధికారులు

రాజేంద్రనగర్‌: గణేశ్‌ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని... అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అధికారులు కోరారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని రాజేంద్రనగర్‌ సర్కిల్‌ కార్యాలయంలో సోమవారం అన్ని శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో గణేశ్‌ ఉత్సవ సమితి సభ్యులతో పాటు రాజేంద్రనగర్‌ సర్కిల్‌ కమిషనర్‌, తహసీల్దార్‌, లా అండ్‌ ఆర్డర్‌, ట్రాఫిక్‌ పోలీసు ఉన్నతాధికారులు, విద్యుత్‌, జలమండలి అధికారులు పాల్గొన్నారు. గణేశ్‌ ఉత్సవాల నేపథ్యంలో చేపట్టాల్సిన పనులు తదితర వాటిపై చర్చించారు. ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు మండప నిర్వాహకులు తెలిపిన సమస్యలను తదితర సమస్యల పరిష్కారం కోసం సమష్టి కృషితో పరిష్కరిస్తామని వెల్లడించారు. మండపాల నిర్వాహకులతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు తమకు పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించాలన్నారు. ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ఘనంగా నిర్వహించుకుందామని అధికారులు వెల్లడించారు.

విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన



షీ టీం అధికారులకు జ్ఞాపికను అందజేస్తున్న ఎన్‌సీసీ అధికారులు

శంషాబాద్‌ రూరల్‌: మండలంలోని ఒయాసిస్‌ పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు సోమవారం షీ టీం ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. షీ టీం పని విధానం, దానితో ఉపయోగాలను ఏఎస్‌ఐ పంకజ వివరించారు. చిన్నారులపై వేధింపులు, బాల్య వివాహాలపై ఫిర్యాదుల తీరును వివరించారు. చైల్డ్‌ హెల్ప్‌లైన్‌ నం.1098, సైబర్‌ క్రైమ్‌ నం. 1930, భరోసా కౌన్సిలింగ్‌ కేంద్రాలు, స్మైల్‌ టీం, మహిళల అక్రమ రవాణా, సోషల్‌ మీడియా, డయల్‌ 100, హాకీ యాప్‌ వినియోగంపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్‌ నియమాలను వివరించారు. కార్యక్రమంలో హెడ్‌ కానిస్టేబుల్‌ శ్రీనివాస్‌, కానిస్టేబుళ్లు రాఘవేందర్‌, విజయ్‌, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా వ్యర్థాల డంపింగ్‌

- మూసీ పరిసరాల్లో ఇష్టారాజ్యంగా పారబోత
- సర్వీస్‌ రోడ్డులో ఆక్రమణలు



మూసీ పరీవాహక ప్రాంతంలో డంపింగ్‌ చేసిన చెత్త, వ్యర్థాలు



కబ్జా చేసిన దృశ్యం

అత్తాపూర్‌: అత్తాపూర్‌ పరిసరాల్లోని మూసీ నది పరీవాహక ప్రాంతంలో చెత్త ఇతర వ్యర్థాలను యథేచ్ఛగా డంపింగ్‌ చేస్తున్నారు. అత్తాపూర్‌ మూసీ సర్వీస్‌ రోడ్డు మార్గంలో అక్రమణలు కూడా జరుగుతున్నాయి. మూసి పరీవాహక ప్రాంత అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారు. ప్రభుత్వ భూములు కబ్జాలకు గురికాకుండా మూసీ నది తీర ప్రాంతాలను అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేకమైన చట్టాన్ని తీసుకువచ్చి హైడ్రాను ఏర్పాటు చేసుకుంది. అందులో భాగంగా హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌ తనదైన శైలిలో నగరంలో పలు ప్రాంతాలలో ప్రభుత్వ ఆస్తులను స్వాధీనం చేసుకోవడంతో పాటు నాలాలపై నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించి వేశారు. హైదరాబాద్‌-రంగారెడ్డి జిల్లాలను అనుసంధానం చేస్తూ అత్తాపూర్‌ సమీపంలో బ్రిడ్జిని నిర్మించారు. ఈ వంతెన నిర్మాణం నది తీరం వెంట యథేచ్ఛగా ఎవరికి వారు కబ్జాలు చేస్తూ అక్రమ నిర్మాణాలు చేపట్టారు. పి.వి.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్‌ నెంబర్‌ 117 హనుమాన్‌ మందిర్‌ పరిసర ప్రాంతాల్లో కబ్జా పర్వం కొనసాగుతోంది. 112 పిల్లర్‌ ప్రాంతంలో ఓ వ్యక్తి సుమారు వెయ్యి గజాల స్థలాన్ని ఆక్రమించి పెద్ద ఎత్తున షెడ్డు ఏర్పాటు చేసుకున్నాడు. సెకండ్‌ హ్యాండ్‌ వస్తువులను అమ్మే కేంద్రంగా ఆ ప్రాంతాన్ని మార్చివేశారు. ఇరిగేషన్‌, హైడ్రా అధికారులతో పాటు జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు ఈ రహదారి గూండా నిత్యం ప్రయాణిస్తుంటారు. మూసీ నదిలో ఎలాంటి వ్యర్థాలు డంప్‌ చేయకుండా పరిసర ప్రాంతాలు కబ్జాల బారిన పడకుండా అధికారులు పర్యవేక్షణతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

'చిత్రపురి' కమిటీకి షోకాజ్‌ నోటీసు

మణికొండ: చిత్రపురి హౌసింగ్‌ సొసైటీ అక్రమాలపై వచ్చిన ఫిర్యాదులు, హై కోర్టు ఆదేశాలు, విచారణలో వెలుగు చూసిన విషయాల ఆధారంగా కో ఆపరేషన్‌, రిజిస్ట్రార్‌ ఆఫ్‌ కో ఆపరేటివ్‌ సొసైటీ పాలక కమిటీకి షోకాజ్‌ నోటీసు జారీ చేసింది. ఈ నెల 20వ తేదీతో ఉన్న నోటీసు చిత్రపురి కాలనీలోని హౌసింగ్‌ సొసైటీ నోటీసు బోర్డుపై అతికించి వెళ్లారు. అందులో పలువురు కమిటీ నిర్వాహణపై ఫిర్యాదులు చేశారని, వాటిని పలుమార్లు విచారణ జరిపామని, వాటి ఆధారంగా మీ కమిటీని సెక్షన్‌ 34 యాక్ట్‌ ప్రకారం సూపర్‌ సీడ్‌ ఎందుకు చేయవద్దో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ నెల 26వ తేదీ (మంగళవారం)లోపు వివరణ ఇవ్వాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కమిటీ అక్రమాలపై ఫిర్యాదు చేయటం, గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను ఒక్కొక్కటిగా సరిచేస్తామని నిర్ణయించిన తరుణంలోనే ఈ నోటీసు జారీ అయ్యిందని చిత్రపురి అవినీతిపై పోరాటం చేస్తున్న నాయకులు కస్తూరి శ్రీనివాస్‌, మద్దినేని రమేష్‌లు మీడియాకు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

శంషాబాద్‌: పట్టణంలోని ఫిరంగి నాలాలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఆర్‌జీఐఏ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజీవ్‌ గృహకల్ప సమీపంలోని ఫిరంగి నాలాలో మృతదేహం(35) కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉంది. ఒంటిపై మెరూన్‌ రంగు చొక్కా ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎంజీఐటీలో స్టూడెంట్‌ చాప్టర్‌ ప్రారంభం



ప్రారంభ వేడుకలో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ (ఎంజీఐటీ) సీఎస్‌ఈ స్టూడెంట్‌ చాప్టర్‌ను సోమవారం ప్రారంభించారు. మొదటి రోజు ఫ్యాకల్టీ, విద్యార్థులు, ఇండస్ట్రీ నిష్ణాతులతో కలిసి టెక్నికల్‌ లెర్నింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్వాంటమ్‌ కంప్యూటింగ్‌చ ఇంటర్న్‌షిప్‌, పరిశోధన అవకాశాలు, సమాజానికి ఉపయోగకరమైన ప్రభావవంతమైన ప్రాజెక్టులను రూపొందించాలని, మల్టీడిసిప్లినరీ టీమ్స్‌లో భాగస్వామ్యం అవుతూ పనిచేయాలని అతిథులు అజింక్య లోహకరే, చంద్ర దసకా, మైక్రోసాఫ్ట్‌ సీనియర్‌ డైరెక్టర్‌ భరత్‌కుమార్‌లు వివరించారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ కె. సుధాకర్‌ రెడ్డి, హెచ్‌ఓడీ ఎం.రమాబాయి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలు నిండకుండా ప్రత్యేక చర్యలు



డ్రైనేజీ క్లీనింగ్‌ పనులను పరిశీలిస్తున్న కమిషనర్‌ శరత్‌చంద్ర

బండ్లగూడ: డ్రైనేజీల్లో వ్యర్థాలు ఇతర కవర్లతో నిండకుండా ఎప్పటికప్పుడు ఎయిర్‌టెక్‌ మెషిన్‌లతో శుభ్రం చేయిస్తున్నామని బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ బి.శరత్‌చంద్ర అన్నారు. కమిషనర్‌ అండ్‌ డైరెక్టర్‌ ఆఫ్‌ మున్సిపల్‌ అడ్మినిస్ట్రేటివ్‌ ఆదేశాల మేరకు వంద రోజుల ప్రణాళిక ఒక మార్పు అభివృద్ధికి మలుపు కార్యక్రమంలో భాగంగా సోమవారం క్యారీవెల్‌ హోమ్స్‌లో తడి, పొడి, హానికారక చెత్తపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ క్లీనింగ్‌ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సూచనలిచ్చారు. డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్‌, జి.వెంకట్‌ రెడ్డి, వార్డు ఆఫీసర్‌, బిల్‌ కలెక్టర్లు, వర్క్‌ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కేబుల్‌ కట్‌.. సేవలు బంద్‌!

- మూగబోయిన టీవీలు, ఇంటర్నెట్‌
- వినియోగదారులకు తప్పని ఇబ్బందులు
- నిలిచిన ఆర్టీఏ సేవలు



జిల్లా ఆర్టీఏ కార్యాలయంలో వేచి ఉన్న వినియోగదారులు



అలకాపూర్‌ టౌన్‌షిప్‌లో కేబుల్‌ను తొలగిస్తున్న సిబ్బంది

మణికొండ: కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయిందన్న చందాన విద్యుత్‌ శాఖ అధికారుల తీరు తలపిస్తుంది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఏ కాలనీలో చూసినా రోడ్లపై తొలగించిన కేబుల్‌ వైర్లు దర్శనమిస్తున్నాయి. అకస్మాత్తుగా వాటిని తొలగించటంతో ప్రజలకు టీవీలు, ఇంటర్నెట్‌ కనెక్షన్‌లు తొలగిపోవటంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఏకంగా మణికొండలో ఉన్న జిల్లా ఆర్టీఏ కార్యాలయానికి ఉన్న ఇంటర్నెట్‌ వైర్లను తొలగించటంతో సేవలు నిలిచిపోయాయి. దాంతో వందలాది మంది తమ పనుల నిమిత్తం వచ్చిన వారు ఉసూరుమంటూ వెనుదిరగాల్సి వచ్చింది. మంగళవారం వరకు ఇంటర్నెట్‌ను పునరుద్ధరించి సేవలను అందిస్తామని జిల్లా రవాణాశాఖ కమిషనర్‌ సదానందం వారికి తెలిపారు.

కాలనీల వారీగా తొలగింపు...

విద్యుత్‌ స్తంభాలకు ఉన్న కేబుల్‌లు, ఇంటర్నెట్‌ వైర్లను ఇప్పటికే మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రోడ్లలో తొలగించారు. అనంతరం పంచవటి, అలకాపూర్‌ టౌన్‌షిప్‌, సెక్రటేరియట్‌ కాలనీల్లో తొలగించే పనులు చేపడుతున్నారు. దాంతో ఆయా కాలనీల్లో నివసిస్తున్న ఐటీ ఉద్యోగులు ఇంటర్నెట్‌ సేవలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సెల్‌ ఫోన్‌లకు ఉన్న ఇంటర్నెట్‌ అనుసంధానం చేసినా అది అంతగా వేగం లేక పోవటంతో కనెక్టివిటీ సమస్యలు వస్తున్నాయని వారు వాపోతున్నారు. దాంతో తాము తప్పనిసరి కార్యాలయాలకు వెళ్లి విధులు నిర్వర్తించాల్సి వస్తుందని తెలిపారు. జియో సంస్థ తమ నెట్‌వర్క్‌ను సొంత స్తంభాలతో ఏర్పాటు చేసుకోవటం, ఎయిర్‌ టెల్‌ వారివి అండర్‌గ్రౌండ్‌లో కేబుల్‌లు ఉండటంతో ఆయా సంస్థలు సేవలు నిరాటంకంగా కొనసాగుతున్నాయని వాటి వినియోగదారులు తెలిపారు. మిగిలిన అనేక సంస్థల ఇంటర్నెట్‌ సేవలతో పాటు కేబుల్‌ టీవీ కనెక్షన్‌లు పూర్తిగా నిలిచిపోతున్నాయని వారు వాపోతున్నారు. స్తంభాల నుంచి తొలగించిన వైర్లను వెంట, వెంటనే రోడ్లపై నుంచి తరలించకపోవటంతో ఎక్కడ పడితే అక్కడే పడి ఉండి ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యంగా మారాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పంచవటి కాలనీలో కేబుల్‌ వైర్లను లారీలో తీసుకెళ్తున్న దృశ్యం